నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 14 డిసెంబర్ 2023 | www.navatelangana.com

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలో విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-మిరుదొడ్డి

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలలో మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. శ్రీ సత్య సాయి సేవ ట్రస్టు వారు నిర్వహించిన సిద్దిపేట జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎంపీసీ ప్రథమ సంవత్సర విద్యార్థిని శ్రావణి జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనర్ శ్రీ రామచంద్రం ప్రశంసా పత్రం, జ్ఞాపికను ఆమెకు అందజేశారు. వ్యాసరచనలో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలను బహుకరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపక అధ్యాపకేతర బృందం శ్రావణిని, విద్యార్థులను అభినందించారు.

ఆర్టీఐ బోర్డుల్లో ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట: జిల్లాలో ఉన్న ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆర్‌టీఐ బోర్డులలో పాటు ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్లు రాయా లని కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు గుండ్ల శివ చంద్రం, మీడియా స్టేట్ కోఆర్డినేటర్ సాజిద్ కోరారు. బుధవారం సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీని వాస్ రెడ్డికి సీసీఆర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారదర్శక పాలన కోసం సీసీఆర్ సంస్థ పాటుపడుతుందని అన్నారు. సీసీ ఆర్ జాతీయ కమిటీ ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు అంటి కర్రెప్షన్ బ్యూరో పై అవగాహన కల్పించడానికి, తమ హక్కులను కాలరాసే అధికారులపై ఫిర్యాదు చేయడానికి తప్పకుండా బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదనపు కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించడమే కాకుండా అప్పటికప్పుడు ఫోన్ లో అధికారులతో మాట్లాడి ఏసీబీ అధికారుల ఫోన్ నెంబర్ లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ ఆర్ సభ్యులు శివ, ఫారూఖ్ అలీ, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి



నవతెలంగాణ-హత్నూర

పత్తి రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా రామదూత జిన్నింగ్ మిల్ యాజమాన్యం మోసం చేస్తోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవరెడ్డి అన్నారు. హత్నూర మండలం బోర్పట్ల-చందాపూర్ గ్రామ శివారులో గల రామదూత జిన్నింగ్ మిల్‌ను తెలంగాణ రైతు సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ బృందం బుధవారం సందర్శించారు. పత్తి రైతుల నుండి కొనుగోలు చేస్తున్న విధానంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవరెడ్డి మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన తెల్ల బంగారమైన పత్తిని మద్దతు ధర లభిస్తుందని రామదూత జిన్నింగ్ మిల్లుకు తీసుకొస్తే సీసీఐ ద్వారా కాకుండా ప్రవేటుగా కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తుందని ఆరోపించారు. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7020 ఇవ్వాల్సి ఉండగా అనేక సాకులు చెప్పుతూ రూ.6400 నుంచి రూ.6500 వరకు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ప్రైవేటుగా 700 కింటాళ్లు, సీసీఐ ద్వారా మూడు క్వింటాళ్లు కొనుగోలు చేయడంపై ప్రశ్నించగా రైతులు ఆన్లైన్లో పత్తి వేసుకున్నట్టు చూపడం లేదని, ప్రైవేటుగా కొనుగోలు చేస్తున్నామని సాకులు చెప్పుకొస్తున్నారని తెలిపారు. పత్తి రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా మోసం చేస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, రామదూత జిన్నింగ్ మిల్ యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తీసుకొని పత్తి రైతులకు మద్దతు ధర కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రామాంజనేయులు నరసింహారెడ్డి నరేందర్ మైసయ్య కృష్ణ ఈశ్వర్ నర్సింలుపాల్గొన్నారు.

నగర నడిబొడ్డున ఏటీఎంలలో చోరీ

సదాశివపేట ప్రధాన రహదారులలో ఏటీఎంలలో దొంగతనం



నవతెలంగాణ-సదాశివపేట

మంగళవారం రోజు అర్ధరాత్రి సదాశివపేట పట్టణంలోని తిలక్ రోడ్, గాంధీ చౌక్, మార్కెట్ రోడ్డు గల ఏటీఎంలలో మంగళ వారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. బుధవారం సమాచారం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీంను రంగంలో దించి దర్యాప్తు ప్రారంభించారు. మూడు ఏటీఎంలో దొంగతనం జరగడం విడ్డూరంగా ఉందని సదాశివపేట పట్టణ వాసులు వాపోతున్నారు. సదాశివపేటలో పోలీసులు ఉన్నారా? లేరా? అని ఆరోపిస్తున్నారు. రాత్రిపూట పోలీ సులు గస్తీ నిర్వహించడంలో పూర్తిగా విఫం చెందారని విమర్శి స్తున్నారు. సీసీ కెమెరాలకు వైట్ పెయింట్ పూసి దొంగతనం చేశారం టే పోలీసుల వైఫల్యం ఏ మేరకు ఉందో అర్థమవుతోందని ఆరోపి స్తున్నారు. సదాశివపేటలో సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా? లేక దొంగలకు అనుకూలంగా వీటిని ఏర్పాటు చేశారా? అని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

వర్గీకరణపై ఉద్యమం మరింత ఉధృతం



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

ఎస్సీ వర్గీకరణ కోసం 29 సంవత్సరాలుగా కొనసాగుతున్న పోరాటంలో భాగంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, ఎంఎస్పీ జిల్లా ఇన్చార్జ్ మల్లిగారి యాదగిరి అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ ప్రెస్ క్లబ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ సూచన మేరకు వచ్చేనెల రోజులపాటు ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ నెల 15న సిద్దిపేటలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలతో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించి కమిటీలు వేస్తామని తెలిపారు. ఈ నెల 17 నుండి మండల స్థాయిలో సదస్సులు ఏర్పాటు చేసి మండల కమిటీలు వేసి ఉద్యమ కార్యాచరణ చేసి వర్గీకరణ పోరాటాన్ని ముందుకు తీసుకు వెళ్తామన్నారు. ఈ పోరాటంలో మేధావులు, నాయకులు, యువజనులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ముంద్రాతి కృష్ణ, ఎంఎస్పీ అసెంబ్లీ ఇన్చార్జ్ పెర్క పరశురాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు ప్రసాద్, మల్లేష్, పవన్, కళ్యాణ్, ఆంజనేయులు, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు నాగపురి విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం నాగపురి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని కూరాకుల మౌనిక ఇటీవల మంచిర్యాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో గెలుపొంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎలికట్టె అయిలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 21 వరకు న్యూఢిల్లీలో జరిగే 67వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు వ్యాయామ ఉపాధ్యాయురాలు గంప విశాల, విద్యార్థిని మౌనిక వెళ్తున్నట్లు పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు, విద్యార్థినిని ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, సర్పంచ్ బండమీది సంతోషి కరుణాకర్, ఎస్ఎంసి చైర్మన్ ప్రజ్ఞాపురం నరసింహులు అభినందించి సన్మానించారు. ఢిల్లీ వెళ్ళడానికి ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ రూ.3వేలు మౌనికకు ఆర్థిక సాయం అందజేశారు.

బీసీ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

తెలంగాణ రాష్ట్రంలో 60 శాతానికిపైగా ఉన్న బీసీ కులాల ఆర్థిక ప్రగతికి ఆయా సామాజిక వర్గాల్లో ఉన్న జనాభా ప్రతిపాదికన పూర్తి సబ్సిడీతో కూడిన రుణాలను ఇప్పించి బీసీ కార్పొరేషన్‌ను పటిష్టం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్క అనిల్ గౌడ్ కోరారు. బీసీలలో ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా కూలీలుగా మారుతున్నారని, యువతకు స్వయం ఉపాధి కల్పించే విధంగా బీసీ కార్పొరేషన్ నిధులను కేటాయించాలని అన్నారు. ఎంచుకున్న ఉపాధి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించి బీసీల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం నూతన విధివిధానాలను రూపొందించే విధంగా బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేయాలని అన్నారు.

మహాలక్ష్మి పథకంతో ఆటో కార్మికులకు నష్టం





ఆటో డ్రైవర్లు ఆవేదన



నవ తెలంగాణ మిరుదొడ్డి : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంతో తమ పొట్టకొట్టే విధంగా ఉందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడంతో ప్రయాణికులు పూర్తిస్థాయిలో బస్సులలో ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగించే డ్రైవర్ల పరిస్థితి మరీ దయనీయంగా మారిందన్నారు. కొద్దిరో జులుగా డీజిల్ డబ్బులు కూడా రావడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆటో డ్రైవ ర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆటో డ్రై వర్లకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళ నలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాలమలు, నాగరాజు, మహేందర్, మహేశ్, హరీశ్, శంకర్ రాజు, కిరణ్, కుమార్, బాబు, కిరణ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ దుబ్బాక రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా కోసం తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా ఆటో డ్రైవర్లంతా రోడ్డుపై పడ్డారని, దీంతో కుటుంబ పోషణతో పాటు ఫైనాన్సుల్లో తెచ్చిన అప్పులు చెల్లించలేని పరిస్థితిలో ఆటో కార్మికులున్నారని, తమను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు కోరారు. బుధవారం దుబ్బాక మండలంలోని సిద్దిపేట మెదక్ జాతీయ రహదారిపై తిమ్మాపూర్ స్టేజి ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్ద గుండవెళ్లి ఆటో యూనియన్ అధ్యక్షులు గూడురీ స్వామి మాట్లాడుతూ ఫైనాన్సుల్లో తెచ్చిన అప్పులు చెల్లించలేని పరిస్థితిలోకి ఆటో కార్మిక రంగాన్ని ఈ ప్రభుత్వం నెట్టేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత ప్రయాణ పథకం తమ ఉపాధిని దెబ్బతీసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితి లేదని, ఆటోలలో మహిళ ప్యాసింజర్లు ఎక్కకపోవడంతో రోజంతా తిరిగిన చేతికి వంద రూపాయలు కూడా సంపాదించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆటో యూనియన్లతో ప్రభుత్వం చర్చలు జరిపి తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు మల్లుగారి అశోక్, మద్ది బాలయ్య , దేవేందర్ ఎల్లం, అశోక్, యాదగిరి ఉన్నారు

నవతెలంగాణ-బెజ్జంకి: ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తుండడంతో మా బతుకుదెరువు దెబ్బతింటోందని, ఇప్పుడు మా బతుకుదెరువెట్లని అవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గం చూపాలని ఆటోడ్రైవర్లు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గం చూపాలని కోరుతూ బుధవారం శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆటో యూనియన్ అద్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆటోడ్రైవర్లు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రం నుంచి నలువైపులా సుమారు 40 కిలోమీటర్ల వరకు ఆటోలతో జీవనం సాగిస్తున్నారని, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో ఆటోల్లో ప్రయాణికులు తగ్గి తమ ఉపాధికి దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఆటోలకు ఇంధన ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొందని, తమకూ ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని ఆటో కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎన్నడూ ఈ పరిస్థితి చూడలేదు



గత 32 ఎండ్లుగా ఆటోపై ఆధారపడి జీవిస్తున్నాను. ఇన్నేండ్లలో ఈ పరిస్థితి ఎన్నడూ చూడలేదు. గ్రామాల నుంచి మండలాలకు, మండలాల నుంచి జిల్లా కేంద్రాలకు ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగించాం.ఉచిత ప్రయాణంతో ఆటో కార్మికుల ఉపాధికి భారీగా గండి పడింది.కనీసం ఇంధన ఖర్చులు కూడా రాని దుస్థితి ఏర్పడింది.ఇప్పుడు ఉపాధి దెబ్బతింటే అప్పులపాలవుతాం.ప్రభుత్వం మా సంక్షేమం గురించి ఆలోచన చేయాలి.

\- ఎలకపల్లి ముత్తయ్య, ఆటోకార్మికుడు

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రయాణికులను చేరవేయడమే ప్రధాన జీవనోపాధిగా ఆటోలపై ఆధారపడిన కార్మికులు ప్రతినెలా తమ వాహన ఫైనాన్స్ సహా కుటుంబ పోషణ, పిల్లల చదువులకు వచ్చే అరకొర ఆదాయం సరిపోవడం లేదు. పైగా అప్పుల పాలై అవస్థలు పడుతున్నారు. ఇలాంటి సమయంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు కారణంగా ఆటోల్లో ప్రయాణికులు తగ్గి ఆదాయానికి గండిపడుతుంది.అన్ని వర్గాలనూ చేరదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోకార్మికుల సంక్షేమాన్ని చేపట్టి ప్రతినెలా జీవన భృతి అందజేయాలి.

\- రామంచ మల్లేశం, ఎస్ఎల్ఎన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు

మంత్రి పొన్నంకు కాంగ్రెస్ శ్రేణుల ఘన స్వాగతం

- స్వాగత కార్యక్రమంలో జేబుదొంగల చేతివాటం







నవతెలంగాణ-బెజ్జంకి

రాష్ట్ర బీసీ సంక్షేమ,రవాణాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి మొదటిసారి మానకొండూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కరీంనగర్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన పొన్నం ప్రభాకర్‌కు బుధవారం మండల పరిధిలోని రేగులపల్లి గ్రామ స్టేజ్ వద్ద రాజీవ్ రహదారిపై బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా, టపాసులు కాల్చి పుష్పగుచ్ఛాలు అందిస్తూ..పూలమాలలు వేస్తూ..శాలువాలు కప్పి..గజమాలతో ఘన స్వాగతం పలికారు. రెండో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి, పులి కృష్ణ, మంకాల ప్రవీన్, శానకొండ శరత్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, కాంగ్రెస్ శ్రేణులు పుష్పగుచ్ఛం అందించి మంత్రి పొన్నంకు స్వాగతం పలికారు. పదేండ్ల తర్వాత సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటులో భాగాస్వాములైన నియోజకవర్గ ప్రజలకు,తన రాకకు స్వాగతం పలకడానికి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

బెజ్జంకి క్రాసింగ్ వద్ద మంత్రికి ఘన స్వాగతం

మంత్రిగా బాధ్యతలు చేపట్టి మొట్టమొదటి సారిగా మానకొండూర్ నియోజకవర్గానికి విచ్చేసిన పొన్నం ప్రభాకర్‌కు మండల గౌడ సంఘం అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ చెప్యాల శ్రీనివాస్, మాజీ ఎఎంసీ చైర్మన్ అక్కరవేణీ పోచయ్య,కాంగ్రెస్ నాయకులు ఐలేని శ్రీనివాస్ రెడ్డి,రొడ్డ మల్లేశం,మానాల రవి,దోనే వెంకటేశ్వర్ రావు,గూడెల్లి శ్రీకాంత్,మెట్ట నాగరాజు,బోయినిపల్లి రామచందర్ రావు,జెల్లా ప్రభాకర్,మనాల సాయిబాబా, తిప్పారపు సురేశ్ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువ కప్పి ఆత్మీయ సన్మానం చేశారు.

మంత్రికి ఆటోడ్రైవర్ల వినతి

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడం స్వాగతిస్తున్నామని, ఆటోడ్రైవర్ల జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయ మార్గం చూపాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు రామంచ మల్లేశం ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు వినతిపత్రం అందజేశారు.

జేబుదొంగల చేతివాటం

మంత్రిగా బాధ్యతలు చేపట్టి మొదటిసారి కరీంనగర్ జిల్లా కేంద్రానికి విచ్చేస్తున్న పొన్నం ప్రభాకర్‌కు రేగులపల్లి వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో జేబుదొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి జేబుదొంగలను గుర్తించి విచారణ చేపట్టారు. చర్ల అంకిరెడ్డిపల్లి, శనిగరం గ్రామాలకు చెందిన పిల్లి కిష్టయ్య(రూ.4000) సల్ల తిరుపతి(రూ.1500) నగదు అపహరణకు గురైనట్టు వాపోయారు. కొహెడ మండలం బస్వాపూర్ గ్రామం వద్ద మంత్రి పొన్నం స్వాగత కార్యక్రమంలో జేబుదొంగలు పెద్ద మొత్తంలో నగదును అపహరించినట్టు పలువురు తెలిపారు.

పొన్నం ప్రభాకర్‌కు ఘనస్వాగతం

నవతెలంగాణ - చిన్నకోడూరు

తొలిసారి మంత్రి హెూదాలో కరీంనగర్ జిల్లాకు వెళ్తున్న సందర్భంగా సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు, బెజ్జెంకి, కోహెడ మండలాల సరిహద్దు శనిగరం స్టేజీ వద్ద తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు అజ్జు యాదవ్ ఘన స్వాగతం పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ,మేడిపల్లి సత్యం లకు చెర్లంకిరెడ్డిపల్లి, అనంతసాగర్ గ్రామస్థులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చెర్లంకిరెడ్డిపల్లి, అనంతసాగర్ గ్రామస్తులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాజబోయిన మల్లేశం యాదవ్, పిల్లి కిష్టయ్య ముదిరాజ్, చింతల మల్లేశం యాదవ్, చిక్కుడు అనిల్ ముదిరాజ్, నూనె నర్సయ్య ముదిరాజ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు

- కాంగ్రెస్ ప్రభుత్వం స్పీడ్ బ్రేకర్ లాంటిది
- పార్లమెంటుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-నర్సాపూర్

కార్యకర్తలు అధైర్య పడవద్దని అండగా ఉంటానని, నాకు సమాచారం అందిస్తే చాలు గంటలో మీ ముందు ఉంటానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని కంజర్ల శంకర్‌యాదవ్ కల్యాణ మండపంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి గెలుపు పట్ల కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యకర్తల కృషి ఫలితమే నర్సాపూర్‌లో వరుసగా మూడోసారి బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తించుకుంటుందన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు స్థానిక సంస్థ ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లుగా గెలిపించుకుంటామని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పీడ్ బ్రేకర్ లాంటిదని అంతిమంగా గమ్యం చేరేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. కేసీఆర్‌ది పనితనం, తీసి మనస్తత్వం తప్ప పగపట్టే మనస్తత్వం కాదని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో నాయకులు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అనేక అవకతవకలకు పాల్పడ్డారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే పోరాడాలన్నారు. పార్లమెంటుపై గుర్తు తెలియని దుండగులు టియర్ గ్యాస్‌తో జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ తన గెలుపు కార్యకర్తల కృషి ఫలితమే అన్నారు. కార్యకర్తల నాయకుల రుణం మరవలేనిదని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ,సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ , జడ్పీ చైర్పర్సన్ హేమలత శేఖర్ గౌడ్, లేబర్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, నాయకులు ప్రతాప్ రెడ్డి, చంద్ర గౌడ్, మన్సూర్, గాలి అనిల్ కుమార్ ,గోపి, హరికృష్ణ ,అశోగౌడ్, నహీముద్దీన్, సత్య గౌడ్ పంబల బిక్షపతి, నాగేష్ ,జగదీశ్వర్, శివకుమార్ బోగస్ చంద్రశేఖర్, రమణ గౌడ్, రాజు యాదవ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఆలోచనలున్న విద్యా సంస్థలతో కలిసి పనిచేయడానికి సిద్ధం

- గీతం అధ్యక్షుడు ఎం. శ్రీభరత్





నవతెలంగాణ - పటాన్‌చెరు

విద్యలో కొత్త ఆలోచనలు, ఉన్నతాశయాలతో ఆధునిక పోకడలను ప్రవేశపెట్టాలని అభిలాషించే మాధ్యమిక విద్యా సంస్థలతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ చెప్పారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన 'భారతీయ విద్యా నాయకత్వ సమ్మేళనం'ను ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. భారతదేశ నలుమూలల నుంచి వచ్చిన వివిధ సీబీఎస్ఈ పాఠశాలలు, ఐబీ స్కూల్స్, జూనియర్ కళాశాలల ప్రిన్సి పాళ్లను ఉద్దేశించి మాట్లాడుతూ తాము లిబరల్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నానని, కలిసోచ్చే పాఠశాలలతో కలిసి పయనించడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. కృత్రిమ మేథ వల్ల ఐటీ రంగంలోని చాలా ప్రాథమిక స్థాయి ఉద్యోగాలు రానున్న రెండు మూడేళ్లలో కోల్పోతామని, అందువల్ల విద్యార్థుల సంపూర్ణ పరిణితికి బాటలు వేసి లిబరల్ ఎడ్యుకేషన్ వైపు తాము జాతీయ విద్యా విధానం-2020 కంటే ముందు అడుగేసినట్టు చెప్పారు తమ విద్యార్థులు నైపుణ్యం గలవారిగా ఎదగడానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. అందుకు అనుగుణంగా పరిశోధన, నాణ్యత గల అధ్యాపకులు, ప్రపంచ శ్రేణి తరగతి గదులు, ప్రగతిశీల వాతావరణాన్ని తమ వర్సిటీలో సృష్టించేందుకు అధిక మొత్తంలో నిధులను వెచ్చిస్తున్నట్టు శ్రీభరత్ చెప్పారు.గీతం ప్రయోగశాలలను సందర్శించమని సదస్సులో పాల్గొన్న ప్రిన్సి పాళ్లందరికీ ఆయన సూచించారు. కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ద్వారా విధాన నిర్ణయంలో మాస్టర్స్ ప్రోగ్రాము నిర్వహిస్తూ, ప్రపంచ స్థాయి విద్య ఆవశ్యకతను చాటిచెబుతున్నామన్నారు.ఈ సందర్భంగా, ఉన్నత విద్యలో లిబరల్ ఆర్ట్స్, స్టెమ్ ను ఏకీకృతం చేసి వినూత్న మార్గాలను అన్వేషించడంతో పాటు ఉన్నత విద్యలో ఆవిష్కరణలపై ప్యానెల్ చర్చను నిర్వహించారు. ఈఎంఐ సర్వీసెస్ ఇండియా సహ-వ్యవస్థాపకురాలు లక్ష్మీ అన్నపూర్ణ ఈ సందర్భంగా ప్రసంగించారు.తొలుత, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు స్వాగతోపన్యాసం చేశారు. వ్యవస్థాపకులుగా విద్యార్థులు ఎదిగేందుకు గీతం చేపట్టిన పలు చర్యలను వివరించడంతో పాటు వచ్చే వేసవిలో విద్యార్థుల కోసం ఉచితంగా సమ్మర్ స్కూల్ ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. గీతంలోని వివిధ స్కూళ్ల డైరెక్టర్లు తాము నిర్వహిస్తున్న కోర్సులు, ఇతర వివరాలను తెలియజేశారు.

టీఎస్‌టీపీసీ మాజీ చైర్మెన్ బిక్షపతి ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-జోగిపేట



అందోలు జోగిపేట శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో టీఎస్ టీపీసీ మాజీ చైర్మెన్ మఠం బిక్షపతి ఆధ్వర్యంలో స్వాములకు బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ ఎస్.జగన్ మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ డిబి.నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, బిర్లా శంకర్, మహేష్ యాదవ్, మారుతి, తొట్ల లక్ష్మణ్, కోశికే సత్యం, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన జెడ్పీటీసీ, ఎంపీపీ

నవతెలంగాణ-మునిపల్లి



మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జెడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్, ఎంపీపీ శైలజ శివశంకర్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్, సీనియర్ నాయకులు శివశంకర్, ఏఎంసీ వైస్ చైర్మెన్ నారాయణ, రైతుబంధు మండలాధ్యక్షుడు పరశరాం గౌడ్, పార్టీ ఉపాధ్యక్షుడు గడ్డం భాస్కర్, గౌరీగామ చెంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన అఖిల్

నవతెలంగాణ-సంగారెడ్డి



భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు అఖిల్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎల్లవేళలా ప్రజల పక్షాన ఉంటూ.. వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నదన్నారు. కాబట్టి ఎవ్వరూ కూడా ఓటమితో కంగారు పడకుండా రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శిక్షణా కేంద్రంలో 'భోజనశాల'కు టెండర్ ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా చిద్రుప్పలో గల పోలీస్ శిక్షణా కేంద్రంలో సుమారు 9 నెలల కాలానికి అందాద 232 మంది ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల కోసం భోజనశాల నిర్వహించడానికి టెండర్‌లను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఓ ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఈనెల 16 వరకు టెండర్ పత్రాల అమ్మకం జరుగుతుందన్నారు. టెండర్ల దాఖలు కోసం ఈనెల 18 ఆఖరి తేదీ అన్నారు. టెండర్ ఓపెన్ ఈనెల 21గా తెలిపారు. సంగారెడ్డి ఆర్ఐ-డీటీసీ అధికారి కె.శ్రీనివాస్‌రావును 8328451992 నెంబర్ ద్వారా సంప్రదించాలన్నారు. టెండర్ పత్రాల ధర రూ. 500 అని.. తదుపరి వివరాల కోసం డీటీసీ కార్యాలయంల కాంతయ్యను 9491231418 ద్వారా సంప్రదించాలన్నారు.

చింత ప్రభాకర్‌ను సన్మానించిన లోపలికోట పద్మశాలీలు



నవతెలంగాణ- సదాశివపేట

సదాశివపేట పట్టణం లోపలి కోట పద్మశాలీ కుల సంఘం సభ్యులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. పూలమాలలు, పుష్ప గుచ్చాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు మునిపల్లి విశ్వనాథం, సత్యం, గోపాల్, గణేష్, మనోహర్, నర్సింగ్‌రావు, పెంటయ్య, ప్రభాకర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సగం నెల గడిచినా.. వేతనాల్లేవు

వెంటనే ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి : ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

నవతెలంగాణ-సంగారెడ్డి

సగం నెల గడిచిపోతున్నా.. ఇప్పటివరకు సంగారెడ్డి జిల్లాలోని పలు ఎస్‌టీఓ పరిధిలో గల ఉద్యోగ, ఉపాధ్యాయులకు నవంబర్ నెల వేతనాలు జమ కాలేదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.అశోక్, బి.సాయిలు, ఉపాధ్యక్షులు కాశీనాథ్ జాదవ్, ఎం.సువర్ణ, కోశాధికారి పి. శ్రీనివాసరావులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగారం శ్రీనివాస్, అనుముల రాంచందర్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రెండు వేర్వేరు ప్రకటనల్లో వారు మాట్లాడుతూ.. నెలలో మొదటి తారీకున వేతనాలు కచ్చితంగా వేయాల్సి ఉండగా.. ఫైనాన్స్ డిపార్ట్మెంట్ అప్రూవల్ అనే పేరుతో ఈ కుబేర్‌లో టోకెన్ అయిన బిల్లులు ఆపి జాప్యం చేయడంతో 10 నుంచి 15 రోజుల ఆలస్యంగా వేతనాలు జమ కావడం శోచనీయమన్నారు. వేతన జీవులైన ఉద్యోగులకు సమయానికి వేతనాలు అందకపోవడంతో హౌస్ లోన్లు, పర్సనల్ లోన్ల ఈఎంఐలు, అద్దెలు, ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఒక ట్రెజరీ పరిధిలోని కొన్ని పాఠశాలలకు డిసెంబర్ ఒకటో తేదీనాడే వేతనాలు జమ అయ్యాయని.. కానీ మరికొన్ని పాఠశాలలకు ఇంతవరకు జీతాలు అందలేదన్నారు. ప్రతీనెలా పదో తేదీలోపే లోన్‌లు, నెలసరి వాయిదాలు చెల్లించాల్సి ఉంటుందని.. కానీ ఇంత వరకు వేతనాలు రాకపోవడంతో అనేక ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నెల నెలా ఇంటి లోనులు, ఎడ్యుకేషన్ లోనులు, పిల్లల స్కూలు ఫీజులు, పాల బిల్లులు, నిత్యావసర సరుకులు ఇలా ప్రతి కుటుంబానికి చాలా అవసరాలు ఉంటాయని.. వేతనాలు సరైన సమయంలో అందకపోవడంతో ఉద్యోగితోపాటు వారి కుటుంబం కూడా ఇబ్బందులు పడుతున్నదన్నారు. కాబట్టి ప్రతీ నెల మొదటి తేదీనాడే వేతనాలు చెల్లించాలని కొత్త ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా ఎల్-షద్దాయి ఐపీసీ ప్రార్థనా మందిరం వార్షికోత్సవం

ముఖ్య అతిథిగా హాజరైన వైస్ చైర్మెన్ అంతిరెడ్డి అనిల్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీరప్ప బస్తీలో గల ఎల్ - షద్దాయి ఐపీసీ ప్రార్థనా మందిరం వార్షికోత్సవ మరియు 40 రోజుల ఉపవాస దీక్ష కార్యక్రమాలను పాస్టర్ ఏ.సురేష్ బాబు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మెన్ అంతి రెడ్డిగారి అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చి సభ్యులు ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆ కార్యక్రమాల్లో భాగమవడం ఆనందంగా ఉన్నదని.. పాస్టర్లు మరియు చర్చి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే క్రిస్మస్ పర్వదినాన్ని ప్రతీ ఒక్కరు పిల్లా పాపలతో, సుఖ సంతోషాలతో జరుపుకోవాలన్నారు. ప్రార్థనా మందిరాల, క్రైస్తవ సోదర సోదరీమనుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు కాటారం శ్రీనివాస్ ,మెయిన్ స్పీకర్ మెటుశిల,పాస్టర్లు నరేష్,అబ్రాహాం, జోసెఫ్, మాణిక్యం, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

టీవీఎస్ ఎక్సెల్ కారు ఢీ.. వృద్ధుడి మృతి

నవతెలంగాణ-జోగిపేట

టీవీఎస్ ఎక్సెల్, కారు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం సాయంత్రం మండల పరిధిలోని సంగుపేట వద్ద 161 నాందేడ్ హైవే పై జరిగింది. జోగిపేట ఎస్ఐ-2 మొగులయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సంగుపేట గ్రామానికి చెందిన డప్పు నర్సింలు(63) తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై చందంపేట గ్రామానికి వెళ్లి కోడిగుడ్లు కొనుగోలు చేసుకుని తిరిగి గ్రామానికి ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో హైవే రోడ్డు దాటుతుండగా.. నిజమాబాద్ నుంచి కారులో హైదరాబాద్ వైపువెళ్తున్న కారు అతని వాహనాన్ని ఢీకొట్టింది. దాంతో కావడంతో.. అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు, జోగిపేట పోలీసులకు సమాచారం అందించారు. సకాలంలో అంబులెన్స్ వాహనం రాకపోవడంతో కొనఊపిరితో ఉన్న వృద్ధుడు కొద్దిసేపు పోరాడి అక్కడికక్కడే మృతి చెందాడు. అంబులెన్స్ తొందరగా రాకపోవడంతో అక్కడున్న వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్ వాహనం సకాలంలో వచ్చి ఉంటే ప్రాణం దక్కేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు 108 వాహనంలో మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్టు ఎస్సై తెలిపారు.

బైకు బోల్తాపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-పుల్కల్

మండలంలోని బస్వాపూర్ గల ఆదర్శ పాఠశాల ఎదుట.. బైక్ అదుపు తప్పి బోల్తాపడగా ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం పుల్కల్ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కాగా అతడు మద్యం సేవించి ఉన్నాడని.. ఎలాంటి ప్రాణాప్రాయం లేదని వైద్యులు తెలిపారు.

జీసస్ జన్మదిన పండుగను కలిసికట్టుగా జరపాలి

నవతెలంగాణ-జహీరాబాద్

జీసస్ జన్మదిన వేడుకలను అందరు కలిసికట్టుగా జరుపు కోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంత్ నవీన్ కుమార్ అన్నారు. జీసస్ కాల్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాస్టర్ ఉదయ్ భాస్కర్, త్యాగరాజు, చార్లెస్, షీబా రాణి, మంజులత హాజ రయ్యారు. ఈ కార్యక్ర మంలో కేక్ కటింగ్ మరియు ప్రత్యేక ప్రార్థనలు, పాటలు నిర్వహించారు.

ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగాలి

- ప్రజల్లో పోలీసు శాఖ గౌరవాన్ని పెంచేలా విధులు నిర్వర్తించాలి
- సిబ్బందికి జిల్లా ఎస్పీ రూపేష్ సూచనలు

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రజలతో మమేకవుతూ, క్రమశిక్షణతో ముందుకు సాగాలని.. ప్రజల్లో పోలీసు శాఖ గౌరవాన్ని పెంచే విధంగా విధులను నిర్వర్తించాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ రూపేష్ సూచించారు. సంగారెడ్డి జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు దర్బార్ కార్యక్రమానికి ఎస్పీ హాజరై మాట్లాడారు. మారుతున్న సమాజ పరిస్థితులకు అనుగుణంగా తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొని, ప్రజలతో మమేకమవుతూ.. క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలీసుశాఖ ప్రతిష్ట, పోలీసుల పట్ల ఉన్న గౌరవాన్ని దిగజారకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్ర స్థాయి సిబ్బందిపైనే ఉంటుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, బందోబస్తు విధులలో (ఏ.ఆర్) సిబ్బంది సైతం కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం సాయుధ దళాల సిబ్బందితో మాట్లాడుతూ.. వారికున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది శ్రేయస్సు కోసం ఎల్లవేళలా ముందు ఉంటానని, వారి సమస్యలను వీలైనంత తొందరలోనే పరిష్కారిస్తానన్నారు. ఇందులో భాగంగా సిబ్బంది శ్రేయస్సు కోసం వాటర్ ప్లాంట్, ఎస్కార్ట్ సిబ్బందికి జైల్ వద్ద వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. బి.డి. టీం కోసం నూతన వాహనం మంజూరు చేస్తామన్నారు. క్విక్ రియాక్షన్ టీంకు కొత్త యూనీఫార్మ్ షూస్, ఫుల్ ట్రావెల్లింగ్ అలవెన్సు మంజూరు చేస్తామన్నారు. సూపర్ మార్కెట్ తరహాలో క్యాంటీన్ ఆధునీకరిస్తామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి, రివార్డు, పతకాలు అందిస్తామన్నారు. సిబ్బందిలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామన్నారు. శారీరకంగా దృఢంగా ఉన్న వారికి వీఐపీ పర్సనల్ సెక్యూరిటీ అధికారిగా అవకాశం కల్పిస్తామన్నారు. పీఎస్ఓగా విధులు నిర్వహించే అధికారి ఎల్లవేళలా వీఐపీ రక్షణపైనే దృష్టి సారించాలన్నారు. హెూం గార్డ్ సిబ్బందికి హెల్త్ కార్డు, యూనీఫార్మ్ అలవెన్సు, ఐడికార్డులు అందించే విధంగా చూస్తామన్నారు. సిబ్బంది ఫైనాన్షియల్ మేనేజ్మెంట్లో జాగ్రత్తగా ఉండాలని, అనవసర వ్యసనాలకు పోయి ఇబ్బందులకు గురి కావొద్దన్నారు. దర్బార్ ఏర్పాటు చేసి.. సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి తమ సమస్యలను ఓపికగా విని తక్షణ పరిష్కారానికి పునుకున్న జిల్లా ఎస్పీకి ఏఆర్ సిబ్బంది, అధికారులు కృతజ్ఞతలు తెలిపుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు.ఎస్పీ డా.పి.అశోక్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, ఏఆర్ డీఎస్పీ జనార్ధన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శివలింగం, ఐ.టి.సెల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ, ఆర్ఐలు రాజశేఖర్ రెడ్డి, రామరావ్, హన్మిరెడ్డి, ఆర్ఎస్సైలు, డీపీఓ, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



ఇటీవలే జరిగిన ఎన్నికల్లో ఖేడ్ ఎమ్మెల్యేగా గెలుపొందిన పట్లోళ్ల సంజీవ రెడ్డిని కాంగ్రెస్ యూత్ నాయకులు లక్ష్మణ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజ లకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి.. వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న దామోదర అభిమానులు



నవతెలంగాణ-వట్‌పల్లి

ఇటీవలే జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దామోదర రాజనర్సింహ గెలుపుతో పాటు.. పూర్తిస్థాయిలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడితే ఏడుపాయల దుర్గమ్మ వద్దకు పాదయాత్ర చేస్తామని మండలంలోని దుద్యాల గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు మొక్కుకున్నారు. కాగా అటు రాజనర్సింహ గెలుపుతోపాటు.. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. దుద్యాల నుంచి ఏడుపాయల దుర్గ భవాని మాత వద్దకు వారు బుధవారం పాదయాత్ర చేపట్టి.. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు తదితరులు ఉన్నారు.



మంత్రిని కలిసిన షాదనగర్ సర్పంచ్

నవతెలంగాణ-వట్‌పల్లి

రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి దామోద రాజనర్సింహను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండలంలోని షాద్నగర్(గట్‌పల్లి) సర్పంచ్ రమేష్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి.. శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దామోదర మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన గొల్ల కురుమలు, కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేశారన్నారు. రమేష్ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యానికి తావివ్వొద్దు

- త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి
- ప్రజలకు జవాబిదారిగా పని చేయండి
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు



గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా.. నిర్దేశించిన గడువు లోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. పటాన్ చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో 'వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రగతి'పై బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం దశాబ్దికాలంలో నియోజకవర్గ వ్యాప్తంగా తొమ్మిది వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో పని చేస్తామన్నారు. ప్రభుత్వాలు మారినా.. అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దని అధికారులకు సూచించారు. ప్రధానంగా పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల, విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయం తదితర శాఖల అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులకు రూపకల్పన చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని, నిధుల కొరత ఉంటే తనను సంప్రదించాలని కోరారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు సిఎస్ఆర్ ద్వారా నిధులను కేటాయించడం జరుగు తుందని తెలిపారు. నియోజకవర్గం కేంద్రమైన పటాన్ చెరులోని వ్యవసాయ మార్కెట్ యార్డును విస్తరిస్తున్నామని, యార్డ్ సమీపంలో గల రైల్వే శాఖకు సంబంధించిన 20 ఎకరాల భూమిని మార్కెట్ యార్డ్‌కు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినట్టు చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు జవాబుదారీగా పని చేయా లని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ ప్రభాకర్, ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, దేవానందం, ప్రవీణ విజయ భాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీలు సుప్రజా వెంకట్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్ కుమార్, వైస్ ఎంపీపీలు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కాటా శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-అమీన్‌పూర్

పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ 45వ జన్మదిన వేడుకలను అమీన్‌పూర్ మున్సిపాల్టీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. గత సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీ నాయకులు అర్థబలం, అంగబలంతో ప్రజా మద్దతు లేకుండా విజయం సాధించినప్పటికీ.. కాట శ్రీనివాస్ గౌడ్ నైతికంగా ప్రజల్లో విజయం సాధించారన్నారు. అయినప్పటీ ఏ ఒక్క కార్యకర్త కూడా ఓటమికి నిరాశ చెందకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేవిధంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు మన్నె రవీందర్, ప్రధాన కార్యదర్శులు రమేష్ యాదవ్, కుమ్మరి మహేష్ మరియు నాయకులు కోకల శ్రీనివాస్, చంద్రశేఖర్, సుధాకర్ యాదవ్, ఈశ్వర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ప్రకాష్, శంకర్, సతీష్ ముదిరాజ్ మరియు కార్యకర్తలు, కీయెస్జి యువసేన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల వార్షిక ఆదాయపు పన్ను వివరాల సేకరణ



నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అందోల్ మండలాధ్యక్షులు బి. ప్రేమ్ కుమార్ ఉప ఖజానా పరిధిలో ఉన్న విశ్రాంత ఉద్యోగుల వ్యకిగత 2023-2024 వార్షిక సంవత్సరానికి చెందిన ఆదాయపు పన్ను వివరాలను అందోల్ డివిజన్ ఉప ఖజానా అధికారి పవన్ చేతుల మీదుగా బుధవారం స్వీకరించారు. ఈ ఆదాయపు పన్ను వివరాలను స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో అందుబాటులో ఉండే సంఘ బాధ్యుల ద్వారా విశ్రాంత ఉద్యోగులందరూ పొందవచ్చన్నారు. ప్రతీ విశ్రాంత ఉద్యోగి వాటిని సరిచూసుకొని, పన్ను పరిధిలోకి వచ్చినట్లయితే వారి వద్ద ఏవైనా పన్ను మినహాయింపు ధ్రువపత్రాలు ఉంటే అనక్సర్ IIతో పాటు ధ్రువపత్రాలను ఉప ఖజానా అధికారికి ఈనెల ముగింపు లోగా అందజేయాలన్నారు. లేని యెడల వారి ఆదాయాన్ని బట్టి వారి 2023-24 పెన్షన్ నుంచి పన్నును మూలం వద్ద సేకరించి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఉప ఖజానా అధికారి పంపుతారన్నారు. కార్యక్రమంలో జి ల్లా బాధ్యులు నవీన్ కుమార్ గౌడ్, మండల కార్య వర్గ సభ్యు లు శంకరప్ప, రాధాకృష్ణ గౌడ్,టి రాజయ్య, వీరేశం, పాండు రంగం విశ్రాంత ఉద్యోగులు సత్యనారాయణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా తవ్వేస్తున్నారు

- ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-సదాశివపేట



సులభంగా డబ్బులు సంపాదించుకునేందుకు కొందరు వ్యాపారులు అక్రమ మట్టి తరలింపునకు తెరలేపుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిన మట్టి, మొరంను తరలిస్తూ పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా కండ్ల ఎదుటే జరుగుతున్నా.. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

సదాశివపేట మండలంలోని ఆత్మకూరు గ్రామంలో ఈ దందా జోరుగా సాగుతున్నది. ఇంటి నిర్మాణాలు, స్థలం చదును చేసుకోవడానికి మట్టి అవసరాన్ని గుర్తించి.. కొందరు వ్యాపారులు అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. అనుమతులను తుంగలో తొక్కుతూ.. యథేచ్ఛగా మట్టిని తరలించి వ్యాపారం చేస్తున్నారు. ఎక్కడి పడితే అక్కడే పెద్ద పెద్ద గుంతలు తొవ్వుతూ.. మట్టి, మొరంను తరలి స్తున్నారు. ఆత్మకూరు గ్రామంలోని పల్లె ప్రకృతి వనానికి ఆనుకొని ఉన్న స్థలంలో నుంచి పెద్ద ఎత్తున మట్టి తరలింపు జరుగుతున్నది. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారలం దరూ బిజీగా ఉండడంతో.. ఈ మట్టి దందా మూ డు ట్రాక్టర్లు ఆరు టిప్పర్లుగా సాగిందని స్థానికులు చెబుతు న్నారు. పల్లె ప్రకృతి వనం నుంచి మట్టిని పెద్ద ఎత్తున.. ఎదురుగా ఉన్న ఓ ప్రయి వేటు వెంచర్‌కు తర లించారని ఆరోపిస్తున్నారు. రాత్రివేళల్లో ఈ మొరం తవ్వకం జోరుగా నడుస్తోంది. చదును గా ఉన్న స్థలంలో.. ఇష్టారీతిన చేపట్టిన తవ్వకాలతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి కుంటలను తలపిస్తున్నా యని స్థానికులు చెబు తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ దందాను అడ్డుకోవాలని కోరుతున్నారు. విషయమై గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా..తమ వద్ద ఎవ్వరూ అనుమతి తీసుకోలేదన్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



పాఠశాల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు శంకరన్న బుధశారం ఎంపీడీఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకరన్న మాట్లాడుతూ..నాగలగిద్ద గ్రామంలో చేపట్టిన పాంశాల పున:నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్నారు. అలాగే గ్రామంలోని వీధుల్లో సరైన మురికి కాలువలు లేవని, సీసీరోడ్లు కూడా సక్రమంగా వేయలేదన్నారు. కాబట్టి సంబంధిత కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
మెదక్
గురువారం | 14 డిసెంబరు 2023 | www.navatelangana.com

ఎంపీ పదవికి రాజీనామా చేసిన ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-చేగుంట

దుబ్బాక నియోజకవర్గం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లకు అందజేశారని చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మంచి కట్ల శ్రీనివాస్‌లు తెలిపారు. కొత్త ప్రభాకర్ రెడ్డి మెదక్ ఎంపీగా రెండు పర్యాయాలు చేసి, 2023 సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికలలో దుబ్బాక ఎమ్మెల్యేగా పోటి చేసి విజయం సాధించారు. ఈ క్రమంలో రెండు సార్లు భారీ మెజార్టీ తో గెలిపించి సేవ చేసుకునే అవకాశం కల్పించిన మెదక్ పార్లమెంటు నియోజకవర్గ ప్రజలకు కొత్త ప్రభాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి తపాల ఉద్యోగుల సమ్మె



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద శంకరంపేటలోని తపాల శాఖ కార్యాలయం వద్ద మండల తపాల శాఖ ఉద్యోగులు, బీపీఎంలు సమ్మె చేపట్టారు. అఖిలభారత పోస్టల్ ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు తెలంగాణ సర్కిల్ ఆధ్వర్యంలో అన్ని పోస్ట్ ఆఫీస్‌లలో ఉద్యోగులు సమ్మె నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ డాక్ సేవకులకు ఎనిమిది గంటల పని దినాన్ని, పింఛన్ సౌకర్యాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీపీఎంలు మానయ్య, గంగారాం, నెహ్రూ, విజయ్, కృష్ణవేణి, ప్రశాంత్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార దిశగా విధులు నిర్వహించాలి

- అస్తవ్యస్తంగా ఉన్న పరిపాలనను గాడిలో పెట్టాలి
- సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యల వెల్లువ
- ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి



నవతెలంగాణ-వెల్దుర్తి

గత కొంతకాలంగా ఎన్నికల హడావుడిలో భాగంగా ప్రజల సమస్యలను పట్టించుకోక అస్తవ్యస్తంగా ఉన్న పరిపాలన ఒక గాడిలో పెట్టి ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా విధులు నిర్వహించాలని ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు గైరాజరయ్యారు. ధర్మారం సర్పంచ్ శంకర్ రెడ్డి, ఆరెగూడెం సర్పంచి పాల్వంచ శేఖర్‌లు తమ గ్రామ పంచాయతీ పరిధిలో సమస్యలు ఉన్నాయని, వాటిని అధికారులు పట్టించుకోవడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ కరెంటు వైర్లు నెత్తికి తాకే విధంగా వేలాడుతున్నాయని, వెంటనే సరి చేయాలని కరెంటు ఏఈని కోరడంతో త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. వ్యవసాయ అధికారి రూప్సీ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యాసంగి సీజన్‌కు సరిపోయే విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఫర్టిలైజర్ కూడా అందుబాటులో ఉందన్నారు వర్షాకాలంలో పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. వారివారి ఖాతాల్లో డబ్బులు కూడా జమ చేయడం జరిగిందన్నారు. సభను ఉద్దేశించి ఎంపీపీ మాట్లాడారు. అధికారులు ప్రజల సమస్యలపై అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, తహసీల్దార్ తులసీరామ్, ఎంపీఓ జగదీశ్వర్, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయుల వేతనాలు వెంటనే జమ చేయాలి

టీఎస్ యూటీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

నవతెలంగాణ-మెదక్ టౌన్

సగం నెల గడిచిపోతున్నా ఇప్పటివరకు జిల్లాలోని పలు ఎస్‌టిఓ పరిధిలో ఉద్యోగ, ఉపాధ్యాయుల నవంబర్ నెల వేతనాలు ఇప్పటి వరకు వేయలేదని, వెంటనే వేతనాలు వేయాలని టీఎస్‌యుటిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నెల అంతా పని చేయించుకుని తర్వాత నెల మొదటి తేదీన వేతనాలు కచ్చితంగా వేయాల్సి ఉండగా, ఫైనాన్స్ డిపార్ట్మెంట్ అప్రూవల్ అనే పేరుతో ఈకుబేర్‌లో టోకెన్ అయిన బిల్లులు ఆపి జాప్యం చేయడం వల్ల ఉద్యోగుల వేతనాలు 10 నుంచి 15 రోజుల ఆలస్యంగా జమ కావడం శోచనీయమన్నారు. వేతన జీవులైన ఉద్యోగులకు సమయానికి వేతనాలు అందకపోవడంతో హౌస్ లోన్లు, పర్సనల్ లోన్ల ఈఎంఐలు, అద్దెలు, ఫీజుల చెల్లింపు, నిత్యవసర సరుకుల కొనుగోలు చాలా ఇబ్బందికరంగా మారుతుందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం వేతనాల చెల్లింపుపై దృష్టి సారించి వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పద్మారావు ఉపాధ్యక్షులు అజయ్ కుమార్, కవిత కోశాధికారి, రవీందర్ రెడ్డి, కార్యదర్శులు సుధాకర్, భీమ్లా నాయక్‌లు ఉన్నారు.

ఎస్‌జీటీ సభ్యత నమోదు



నవతెలంగాణ -వెల్దుర్తి

సెకండ్ గ్రేట్ టీచర్స్ యూనియన్ మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో సభ్యత నమోదు జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని పాఠశాలను సందర్శించి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాల పూర్వ అభివృద్ధికి వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవడం జరుగుతుందన్నారు. జిల్లా శాఖ పక్షాన సెకండ్ గ్రేడ్ టీచర్స్ సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ జింక అశోక్ మండల అధ్యక్షులు గణపతి యాదగిరి రమేష్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి రూ.5 వేల సాయం



నవతెలంగాణ-కౌడిపల్లి

అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. బుధవారం చిలుముల కిషన్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మండల కేంద్రానికి చెందిన కూరగాయల అంజమ్మ గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ట్రస్ట్ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యురాలు నాగమణికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ గ్రామాలలో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడంలో ట్రస్ట్ ముందుంటుందన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన రాజిరెడ్డి



నవతెలంగాణ-కొల్చారం

మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి మాతృమూర్తి బాలమణి (68) సోమవారం రాత్రి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి అంజనేయులు గౌడ్‌లు బుధవారం సంగాయిపేట గ్రామానికి చేరుకొని మృతురాలి కుటుంబీకులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు చిలుమల సుహాసిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగలగరి మల్లేశం గౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దర్జీ రాజు, ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శేఖర్, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కొంగోడు మాజీ పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మయ్య, మండల బీసీ సెల్ అధ్యక్షులు బండి మల్లేశం, మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అక్రమ్, శ్రీశైలం, బద్యా నాయక్, వరిగంతం సర్పంచ్ ఉమారాణి శ్రీకాంత్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు రాజు, మండల బీసీ సెల్ నాయకులు రవీందర్ గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షులు అర్చనపల్లి శ్రీరాములు, విజయ్ గౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంటారెడ్డిని పరామర్శించిన జెడ్పీటీసీ



నవ తెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాంటారెడ్డి తిరుపతి రెడ్డి సోదరుడు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ బుధవారం కాంటారెడ్డి తిరుపతి రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తమన్నగారి మధుసూదన్ రెడ్డి, సిద్ధి రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మంత్రి పొన్నంకు ఘనస్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని శనిగరం గ్రామ స్టేజీ నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలకు కోహెడ మండల కాంగ్రెస్ శ్రేణులు బుధవారం ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూలమాలతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, వేల్పుల వెంకటస్వామి, గ్రామశాఖ అధ్యక్షుడు మహమ్మద్ నజీర్, చింతకింది శంకర్, బండి రవీందర్, మంద శ్రీపాల్, గూడ స్వామి, అబ్దుల్ రఫీ, నంగునూరి శ్రీనివాస్, పోలు శ్రీనివాస్, తిరుపతి, బందెల బాలకిషన్, చుక్క అశోక్, అర్శనపల్లి జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో రాష్ట్రస్థాయి బహుమతి సాధించడం పట్ల హర్షం



నవతెలంగాణ-కోహెడ

తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర విద్యార్థు లు ఖోఖోలో రాష్ట్రస్థాయి పోటీలలో ప్రథమ బహు మతి సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకట చలపతి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు కామారెడ్డి జిల్లా ఉప్పల్‌వాయిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఖోఖో ఆటలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. రానున్న రోజులలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అలాగే ప్రథమ బహుమతి సాధించినందుకుగాను జాయింట్ సెక్రటరీ సక్రునాయక్ చేతుల మీదుగా బహుమతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పీడీ కృష్ణారెడ్డి, పీఈటీ కె.అశోక్, వైస్ ప్రిన్సిపాల్ రఘుపతి, కె.సంపత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసు

ఇంచార్జ్ వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి



నవ తెలంగాణ-కౌడిపల్లి

నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కౌడిపల్లి మండల ఇన్చార్జి వ్యవసాయ అధికారిని శ్వేతా కుమారి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని వెంకటరావుపేట్, కౌడిపల్లి కేంద్రాలలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని డీలర్లకు సూచించారు. రైతులకు అధిక ధరకు విత్తనాలు అమ్మితే దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. యాసంగికి సంబంధించి అన్ని ఎరువుల కేంద్రాల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. లైసెన్స్ లేని విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు వస్తాయని ఆమె సూచించారు. తెలిపారు.

ఇందిరా గాంధీ స్టేడియంలో దివ్యాంగుల ఆటల పోటీలు



నవ తెలంగాణ-మెదక్ టౌన్

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ అవుట్‌డోర్ స్టేడియంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. దివ్యాంగులకు ఉత్సాహాన్ని నింపడానికి మహిళా శిశు వికలాంగ వయోవృద్ధుల సంక్షేమ శాఖ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని బ్రహ్మాజీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుంటారని వారిని ప్రోత్సహిస్తే అన్ని రకాల అద్భుతాలు సృష్టిస్తారన్నారు. వికలాంగులు ఎంతో మనో ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ఉంటారన్నారు. అనుకున్నది సాధించాలని పట్టుదల కలిగి ఉంటారన్నారు. క్రీడలు మానసిక ఉత్సాహాన్ని కల్పిస్తాయన్నారు. శారీరక వికలాంగులు, మానసిక వైకల్యం గల 10 నుంచి 17 సంవత్సరాల లోపు బాల బాలికలకు, సీనియర్స్ 17 నుంచి 35 సంవత్సరంలోపు మహిళలు, పురుషులకు పరుగు పందెం, షాట్ పుట్, జావలింగ్ త్రో, చెస్, క్యారం బోర్డు వంటి పోటీలను నిర్వహించారు. దివ్యాంగులు ఈ పోటీలలో ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. డిసెంబర్ 15న బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు, సిబ్బంది, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ రోడ్డు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వినతి



నవతెలంగాణ-చేగుంట

ప్రధాన సమస్య అయిన చేగుంట మెదక్ వెళ్లే రోడ్లో ఉన్న రైల్వే గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవకు వినతి పత్రాన్ని అందజేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉన్న పలు సమస్యలపై వివిధ కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలను సమర్పించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి రైల్వే క్రాసింగ్ 228 వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. తాజా మాజీ ఎంపీ, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించి మెదక్ చేగుంట రహదారిలో ట్రాఫిక్ విషయంలో అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయులకు సన్మానం

రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



నవ తెలంగాణ-మిరుదొడ్డి

ప్రతి ఉద్యోగికి బదిలీలు తప్పనిసరని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు బుధవారం అక్కరుపేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్ ఉపాధ్యాయ బదిలీపై భూంపల్లి పాఠశాలలో 8 సంవత్సరాలుగా తన బాధ్యతలు స్వీకరించి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి బదిలీపై చిన్నకోడూరు మండలంలోని మాచపూర్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ కలిసి వీడ్కోలు సభను నిర్వహించి శాలువాలు పూలదండలతో సన్మానించారు. కొత్తగా వచ్చిన ప్రధానోపాధ్యాయులు రాజేందర్‌ను కూడా సన్మానించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ పాఠశాలకు విద్యార్థులకు అందించిన సేవలను, ఉత్తమ ఫలితాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు గుర్తు చేసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న జగదీశ్వర్, బదిలీపై భూంపల్లి స్కూల్‌కు వచ్చిన రాజేందర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలుగా భూంపల్లి ప్రాథమిక పాఠశాలకు జగదీశ్వర్ మంచి ఉన్నతమైన విద్యను, క్రమశిక్షణను విద్యార్థులకు అందజేశారన్నారు. విద్యార్థులు, పాఠశాల విషయంలో తనకు కాల్ చేసి పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు సదుపాయాలు కల్పించారన్నారు. అలాగే ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రధానోపాధ్యాయులు కూడా స్కూల్‌కు మంచి ఫలితాలు అందించి, మంచి పేరు తీసుకురావాలని బక్కి వెంకటయ్య కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, ఎంఇఓ ప్రభుదాస్, స్కూల్ చైర్మన్ నర్సింహులు, ఎంపిటిసి ఉమారాని-బళగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలి

డీఎస్‌పీ జిల్లా అధ్యక్షులు కర్రోల్ల రవిబాబు



నవ తెలంగాణ-సిద్దిపేట

మహలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కర్రోల్ల రవిబాబు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యాలయంలో ముఖ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 9న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారు కానీ ఈ ఉచిత ప్రయాణంలో చాలా అనర్థాలు, నష్టాలు ఉన్నాయన్నారు. హేతుబద్ధంగా ఈ ఉచిత ప్రయాణాన్ని సవరించాల్సి ఉందన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ అవకాశం కల్పించాలన్నారు. ధనవంతులైన మహిళల ఉచిత ప్రయాణాన్ని, నియంత్రించవచ్చని, నెలకు లక్ష రూపాయలు సంపాదించే మహిళా ఉద్యోగస్తుల ఉచిత ప్రయాణాన్ని కూడా నియంత్రించవచ్చన్నారు. దీని వల్ల ఆర్టీసీకి నష్టం తగ్గుతుందన్నారు. అదే ఆర్టీసీ బస్సులలో తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలైన పురుషులకు కూడా ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సులలో ఈ ఉచిత ప్రయాణం ప్రభావం ఆటో కార్మికులపై పడుతుందని, తద్వారా ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్ర నష్టానికి గురవుతున్నారన్నారు. ఈ నష్టాన్ని భరించడానికి ఆటోనడిపే నిరుద్యోగ కార్మికులందరికీ నెలకు రూ 3000/- చొప్పున ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలో అనేక మండలాలలో మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం లేదని, అందుకని అన్ని గ్రామాలకి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణలో విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు లాంటి మౌళిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం ఈ సూచనలను స్వీకరించకపోతే డిసెంబర్ 15 నుంచి మండల, జిల్లా, రాష్ట్ర అధికారులందరికీ విజ్ఞాపన పత్రాలు అందిస్తామన్నారు. స్పందించకపోతే నిరసనలు కూడా తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డి.బి. రాజు, సురేష్, యాదగిరి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కెజీబీవీ, టీఎస్‌డబ్యూఆర్ఎస్, మాడల్ స్కూల్, నాగసముద్రాల, బస్వాపూర్ పాఠశాలలలో పదోతరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు బుధవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్షాప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 294 మంది విద్యార్థులకు పరీక్షాప్యాడ్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.వెంకట చలపతి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కే. నరేందర్‌రెడ్డి, కెజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వై.హిమబిందు, ప్రధానోపాధ్యాయులు ఎండీ.మహమూద్, ఆర్.పద్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన

అడిషనల్ డీసీపీ ఎస్ మల్లారెడ్డి



నవ తెలంగాణ-రాయపోల్

బాలికలు, మహిళలు రక్షణ చట్టాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డీసీపీ అడ్మిన్ ఎస్ మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు బాలికలు, మహిళలు రక్షణకు చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. బాలికలు మహిళలు అపరిచిత వ్యక్తులను నమ్మవద్దన్నారు. మహిళలు, బాలికలు మౌనం వీడి నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. షీటీమ్ ప్రాముఖ్యత, నిర్వహించే విధులు, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాలు వాటి పరిణామాలు, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాల గురించి వివరించారు. సోషల్ మీడియా పరిణామాలు, సైబర్ సెక్యూరిటీ,మైనర్ డ్రైవింగ్,డయల్ 100 ప్రాముఖ్యత, సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి నుంచి ఎలా రక్షణ పొందాలనే అంశాల గురించి వివరించారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, మహిళల, పిల్లల రక్షణకు ఉన్న చట్టాల పట్ల అవగాహన కల్పించామన్నారు.గతంలో జరిగిన నేరాల గురించి నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, భరోసా సెంటర్లో ఫోక్సో కేసులలో 18 సంవత్సరాలు లోపు ఉన్న బాలికలకు అందిస్తున్న సేవల గురించి తెలియజేశారు. మహిళలు గృహహింస, వరకట్నం గురించి శారీరకంగా మానసికంగా హింసించే అంశాల గురించి మహిళా సెంటర్లో నిర్వహించే కౌన్సిలింగ్ గురించి వివరించారు. విద్యార్థులు లక్ష్యం, అపరిచిత వ్యక్తులతో ఎలా ప్రవర్తించాలని అంశాల పట్ల వివరించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి విద్యార్థినిలకు వివరించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు వేధించిన, అవహేళనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100, సిద్దిపేట షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434 స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్,9494639498, మహిళ పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. షీటీమ్ సేవల గురించి తెలిపిన పాఠశాల విద్యార్థిని అభినందించి చిరు కానుక అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రఘుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది ఏఎస్ఐ శ్రీరాములు,మహిళ కానిస్టేబుల్లు శ్యామల, లావణ్య, కానిస్టేబుల్లు మహేష్, రామచంద్రారెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జెడ్పీటీసి పరామర్శ



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

దుబ్బాక మండలం గంభీర్పూర్ గ్రామానికి చెందిన రేపాక ఆశి రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పిటిసి కడతల రవీందర్ రెడ్డి బుధవారం మృతుని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అధైర్య పడొద్దు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. బాధితులను పరామర్శించిన వారిలో సర్పంచ్ కరికే భాస్కర్, సిద్దిపేట బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుండెలు ఎల్లారెడ్డి, జిల్లా నాయకులు కొత్త కిషన్ రెడ్డి, పడాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన గోపికృష్ణ



నవ తెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి పూజల గోపికృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని గోపికృష్ణ తెలిపారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎంపిటిసి లింగాల శ్రీనివాస్, సర్పంచ్ స్వప్న నరేష్‌లు లబ్దిదారులకు బుధవారం అందించారు. ఈ సందర్భంగా చింతకింది వైష్ణవి తండ్రి రాములుకు లక్ష రూపాయల చెక్కు, అలాగే కృప తండ్రి రాజేందర్ కు లక్ష రూపాయల చెక్కులను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మితో ఎంతోమంది పేద ఆడపిల్లలకు మేలు కలుగుతుందన్నారు.

మహ్మదాపూర్‌లో పంటల వివరాల నమోదు



నవ తెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్ గ్రామంలో బుధవారం ఏఈఓ టి .ప్రణీత పంటల వివరాలు నమోదు చేశారు. అనంతరం మహ్మదాపూర్ రైతు వేదికలో రైతుబంధు దరఖాస్తులను తీసుకున్నారు. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న రైతులు వారి పట్టాపాస్ బుక్కు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ ఇవ్వాలన్నారు.

జీడీఎస్ తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె



నవతెలంగాణ-మర్కుక్

జీడీఎస్ తపాలా ఉద్యోగులకు 8 గంటల పని,పెన్షన్, ప్రమోషన్, మెడికల్ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ అఖిల భారత జీడీఎస్ సంఘం పిలుపు మెరకు పాములపర్తి తపాలా సిబ్బంది చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం నాటికి రెండో రోజు కు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కారించే వరకు సమ్మె విరమించేది లేదని తెలిపారు. సమ్మెకు ప్రజల సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రవల్లి, మర్కుక్, పాములపర్తి, గౌరారం, శీలసాగర్, నర్సంపల్లి, వర్గల్, మామిడాల, భైలంపూర్, తపాల సిబ్బంది తదితరులున్నారు.

మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి



ఐదో వార్డ్ కౌన్సిలర్ శ్యామల మల్లేశం యాదవ్

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఐదో వార్డు కౌన్సిలర్ శ్యామల మల్లేశం యాదవ్ అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా వార్డు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కృషితో మున్సిపల్‌తో పాటు వార్డు అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు వార్డు అభివృద్ధికి, మున్సిపల్ అభివృద్ధికి సహకరించినట్లు గుర్తు చేశారు. సంగాపూర్, ముత్రాజ్పల్లి తదితర గ్రామాల్లో సిసి రోడ్లు, మురికి కాలువ నిర్మాణం కొనసాగుతోందన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి కృషితో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ముత్రాజ్పల్లి చౌరస్తాను సుందరీకరణ చేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. రానున్న కాలంలో మున్సిపల్‌ని మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

సన్నాలకు మద్దతు ధర కరువు

- బియ్యం ధర కోసం కొత్త సర్కారుపై ఆశలు
- గణనీయంగా పెరుగుతున్న వరి సాగు





నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రాంతంలో సన్నరకం వరి సాగు పెరుగుతోంది. గజ్వేల్ వ్యవసాయ సబ్ డివిజన్లో కొండపాక, రాయపోల్, గజ్వేల్, ములుగు డివిజన్లో ములుగు, వర్గల్, మర్కుక్ మండలాల్లో సన్న రకం వడ్లు పండిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో 5.70 లక్షల పైచిలుకు ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. వరి 3.90 లక్షల ఎకరాలకుపైగా సాగు చేశారు. ఇందులో 30 శాతానికిపైగా సన్నరకం వడ్లు సాగులోకి వచ్చాయి. సన్నరకాలకు విపరీతమైన డిమాండ్ ఉంటుందనే ఆశతో రైతులు సన్నాల వైపు మొగ్గు చూపారు. ఏటా సన్నాల సాగు పెరుగుతూనే ఉంది. ఉత్పత్తులను నామమా త్రపు గిట్టుబాటు ధరతో గజ్వేల్ సిద్దిపేట్, దుబ్బాక, చేగుంట, రామాయంపేట, చేర్యాల తదితర చోట్ల రైతులు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం ఏ-గ్రేడ్ రకం వడ్లకు రూ.2,208, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర ప్రకటించిం ది. దొడ్డు రకాలతో పోలిస్తే సన్న రకాలకు అందుతున్న గిట్టుబాటు ధర తక్కువే. సాధారణంగా బహిరంగ మార్కెట్లో సన్నరకం బియ్యం క్వింటాల్‌కు కొత్తవి రూ.4,300కుపైగా, పాతవి రూ.5,500కుపైగా ధర ఉంటోంది. దొడ్డు బియ్యం రూ.3 వేలలోపే లభిస్తున్నాయి. వడ్ల ధర విషయానికొస్తే పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర ప్రకారం దొడ్డు రకానికి (ఏ గ్రేడ్) క్వింటాల్‌కు రూ.2,203 చెల్లిస్తారు. సన్నాలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా రైతులు ప్రైవేటు వ్యాపారుల వైపు మొగ్గు చూపుతున్నారు. నిజానికి సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.2,800కు పైగానే ధర దక్కాలి. వ్యాపారులు మాత్రం రూ.2,400కు మించి ధర చెల్లించడం లేదు. సన్న రకం వడ్లకు ఇది చాలా తక్కువ ధరే. డిమాండ్ దృష్ట్యా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక ధర ఉంటే రైతులకు మేలు జరిగిదే. భిన్నమైన పరిస్థితి నెలకొంది. సన్నాలు పండించాలంటే శ్రమ, పెట్టుబడి ఎక్కువే. కాలం అనుకూలంగా ఉంటే సాధారణంగా గజ్వేల్లో ఆరబెట్టిన సన్న రకం ధాన్యం దొడ్డురకాలు సాగు చేసే రైతులకు ఎకరాకు 28-30 క్వింటాళ్ల వద్ద దిగుబడి వస్తుంది. సన్నరకంతో పోలిస్తే వంటల వ్యవధి, శ్రమ రెండూ తక్కువ. కానీ సన్నరకాలు ఎకరాకు 20-24 క్వింటాళ్లకు మించి దిగుబడి రాదు. పంటకాలం కూడా ఎక్కువే. ఇలాంటి సమయాల్లో రైతుల శ్రమ, పెట్టుబడి సన్న రకాల ఉత్పత్తిలో ఎక్కువగానే ఉంటోంది. ఆరు గాలం శ్రమించి పంటను ఉత్పత్తి చేస్తే ధర విషయంలో మాత్రం చేదు అనుభవం ఎదురు కావడం ఆందోళన కలిగిస్తోంది.

ఈసారి పాత విధానమే..

ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. పాత విధానంలోనే కొనుగోళ్లు సాగుతున్నాయని సం బంధిత అధికారులు చెబుతున్నారు. కొనుగోళ్ల తీరులో మార్పు రాకపోవడంతో సన్న రకం వడ్లు చిన్నబోతున్నాయి. దొడ్డు రకం వడ్లతో పోలిస్తే సన్న రకానికి, బియ్యానికి బహిరంగ మార్కెట్లో డిమాండ్ ఎక్కువ. కానీ దొడ్డు రకాల మద్దతు ధరకే విక్రయించాల్సి వస్తోంది. ప్రత్యేక ధర అంటూ లేకపోవడంతో సన్నాలను రైతులు వ్యాపారులకు నామమా త్రపు ధరకు అమ్ముకుంటున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా మార్పు వస్తుందేమోనని రైతులు ఆశగా ఎదు రుచూస్తున్నారు. ఎఫ్‌సీఐకు చెందిన పదికిపైగా కొనుగోలు కేంద్రాలను నడిపేవారు. ఈ కేంద్రాల్లో దొడ్డు వడ్లతో పోలిస్తే అదనంగా మరో రూ.400 ధరను చెల్లించేవారు. వీటిని కొన్నేళ్లుగా పూర్తిగా ఎత్తేశారు. ప్రస్తుతం ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలోనే కొనుగోళ్లు సాగుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన కొనుగోలు ఉంటే రైతులకు ఈ ధర దక్కి కొంత ఊరట లభించేది. ఈ కేంద్రాలను ఎత్తివేయడంవల్ల పరిస్థితి భిన్నంగా మారింది. ఫలితంగా జిల్లాలో సన్న రకం వడ్లను సాగు చేసే రైతులకు నష్టాలు తప్పేలాలేవు. ప్రభుత్వ విధానాల్లో మార్పు వస్తే తప్ప రైతులకు మేలు జరిగే అవకాశం లేదు. కొత్త ప్రభుత్వంలోనైనా తమకు మేలు జరుగుతుందేమోనని రైతులు ఎదు రుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గమనించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-మర్కుక్

నూతనంగా వ్యవసాయ పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని మర్కుక్ మండల వ్యవసాయాదికారి టి.నాగేందర్‌రెడ్డి తెలిపారు. నూతనంగా వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేసుకొని పట్టాదారు పాసుబుక్ పొందిన రైతులు స్థానిక రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారి వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతుబంధు దరఖాస్తు దారులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్ జిరాక్సులు, దరఖాస్తు ఫారం అందజేయలన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన గజ్వేల్ మహేష్



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను బుధవారం హైదరాబాదులో మంత్రి చాంబర్లో గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన గజ్వేల్ మహేష్ కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని గజ్వేల్ కాంగ్రెస్ నాయకులకు ఉపముఖ్యమంత్రి సూచించారు. గజ్వేల్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. పార్లమెంటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో గెలిచే విధంగా కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఇప్పటికే రెండు అమలు చేశామని మరో వంద రోజుల్లో నాలుగు అమలు చేస్తామని ప్రజలకు వివరించాలన్నారు.

పేద యువతికి ఎల్‌ఓసీ ఇవ్వని బీఆర్‌ఎస్ నాయకులు



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కొండూరి రాణి అనారోగ్యానికి గుర్తై ఆసుపత్రిలో చికిత్స చేయిం చుకునేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఎల్‌ఓసీ కోసం దరఖాస్తు చేసుకుంది. ప్రభుత్వం నుండి 13-9-2023న కొండూ రి రాణికి రూ.20 వేల ఎల్‌ఓసీ మంజూరు చేశారు. ఆ చెక్కు మూడు నెలలుగా బీఆర్‌ఎస్ నాయకులు తమ వద్దే పెట్టుకొని ఇప్పటివరకు ఇవ్వలేదని, నిన్నటికి చివరి రోజు కావడంతో ఎల్‌ఓసీ చెక్కును కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు సుందరగిరి సత్యనారాయణగౌడ్‌కు చేర్యాల మండలం బీఆర్‌ఎస్ నాయకులు ఇవ్వడంతో బాధితురాలి కుటుంబానికి ఎల్‌ఓసీ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు కొండూరి రాణి కుటుంబం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడంతో కావాలనే ఎల్‌ఓసీ చెక్కును బీఆర్‌ఎస్ నాయకులు ఆపారని ఆరోపించారు, పార్టీలకతీతంగా ప్రజలకు సేవ చెయ్యాలి తప్ప ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగిళ్ల యాకూబ్ గౌడు, నాయకులు బొంగరం శేఖర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు

17వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని కౌన్సిలర్ లక్ష్మి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గత తెలంగాణ ప్రభుత్వం మున్సిపల్ అభివృద్ధికి వార్డు అభివృద్ధికి ఎన్నో నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. వార్డులో కొన్ని సిసి రోడ్లు మురికి కాలువలు నిర్మాణం జరిగిందని, మరికొన్ని పనులు చేపడుతున్నామని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ కృషితో మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కెసిఆర్ ఆరోగ్యంగా కోలుకొని గజ్వేల్ అభివృద్ధి మరింత చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. నాలుగు సంవత్సరాలుగా 17వ వార్డు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలంది స్తున్నామన్నారు. ముట్రాజ్ పల్లి, ఆఫీసర్స్ కాలనీ, లక్ష్మీ ప్రసన్న కాలనీ, పాత శివాలయం బస్తీ తదితర ప్రాంతంలో కావాల్సిన అభివృద్ధి పనులను చేపడుతు న్నట్లు తెలిపారు. మాజీ మంత్రి హరీష్‌రావు కృషితో మున్సిపల్‌తో పాటు తన వార్డు అభివృద్ధి జరిగిందన్నారు.

ఇకనుంచి గ్యారెంటీగా గజ్వేల్‌కే ప్రధాన్యత

- కార్యకర్తలకు భరోసా ఇచ్చిన ఈటెల రాజేందర్



నవ తెలంగాణ- గజ్వేల్

ఎన్నికల్లో పోటీ చేసి వెళ్లిపోయావా? అనేది కాదని ఇకనుంచి గ్యారెంటీగా గజ్వేల్కే అధిక ప్రాధాన్యత ఇచ్చి కార్యకర్తలకు నాయకులకు అందుబాటులో ఉంటానని బీజేపీ స్టేట్ చేరికలు కమిటీ చైర్మన్, మాజీ మంత్రి ఈటల రాజేందర్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఆయన విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈనెల మూడున ఎన్నికల ఫలితాలు అనంతరం గజ్వేల్ నియోజకవర్గ నాయకులతో మూడు నాలుగు సార్లు సమావేశమయ్యారు. తిరిగి బుధవారం నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం తూప్రాన్, మనోహరాబాద్ మండలాల కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఇకనుంచి గజ్వేల్ నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా తక్షణమే అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తలకు గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు తన ఇంటి తలుపు ఎప్పటికీ తేరిచి ఉంటుందన్నారు. ఏ రాత్రి ఫోన్ చేసినా తాను అందుబాటులోకి వస్తానని హామీ ఇచ్చారు. ఇకనుంచి ఏడాది పాటు ఎన్నికలు ఉండే అవకాశం ఉందన్నారు. అన్ని ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గంలో పోటీచేసి బీజేపీ సత్తా చాటాలని ప్రణాళికలు సిద్ధం చే న ం క ు న్నా వ ు న్నా ర ు. నియోజకవర్గంలోని గజ్వేల్, వర్గల్, ములుగు మండలాల్లో తాను పరిచయం అవసరం లేదని 1996 నుండి ఆ ప్రాంత ప్రజలతో మమేకమైన ఉన్నట్లు కార్యకర్తలకు చెప్పుకొచ్చారు. మనోహరాబాద్, తూప్రాన్, కొండపాక, జగదేపూర్, మర్కుక్ మండలాలు ఎన్నికల్లో ప్రజలు తనను గౌరవించినట్లు గుర్తు చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు కాగానే అభ్యర్థులను గుర్తించాలన్నారు. ఎంపీటీసీలు, జెడ్పిటిసిలు, మున్సిపల్ కౌన్సిల్ స్థానాలకు ఇప్పటినుండే ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

నర్సాయపల్లిలో భూసార పరీక్షలు



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని నర్సాయపల్లి గ్రామ ంలో ఏఈఓ రాకేష్ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు బుధవారం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి మీద ఉన్న సమస్త జీవరాసులకు మట్టి జీవనాధారం అని అన్నారు. మనుషులు తీసుకునే ఆహారం లో 95 శాతం మట్టి నుండే వస్తుందని. మిగతా ఐదు శాతం సముద్రాలు, నదులు మొదలైన వాటి నుండి వస్తుందని తెలిపారు. రైతుల పొలాల నుండి గ్రేడ్ పద్ధతిలో మట్టిని సేకరించి భూసార పరీక్ష కేంద్రాలకు పంపి ంచి పరిశీలిస్తామని తెలిపారు. భూసార ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులు తగి న మోతాదులో వేసుకోవాలని కోరారు. రైతు లు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి ఎరువులు వాడితే అధిక పంటల దిగుబడి వస్తాయని తెలిపారు.

ప్రజలతో మమేకమై పని చేయాలి

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

ప్రజలతో మమేకమై చిత్తశుద్ధితో పని చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం అధికారులతో సమావేశ మయ్యారు. పొన్నం ప్రభాకర్ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ప్రభుత్వ అధికారులతో తొలిసారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మారిందని, ప్రజల్లో కూడా మార్పు వచ్చిందని. అధికారుల పనితీరు కూడా మారాలని అన్నారు. సమావేశంలో మంత్రి పొన్నంతో పాటుగా జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్వేత, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సరోజ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన చిన్న బోయిన వరదయ్య ఇటీవల మృతి చెందారు. బుధవారం మర్కుక్ ఎంపీపీ తాండ పాండుగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. చెక్కలి రాములు, బోయిని లక్ష్మణ్, నరేష్, మ్యాకల శ్రీనివాస్, లక్ష్మణ్, లాలయ్య, బాలస్వామి తదితరులున్నారు.

31లోగా ఈకేవైసీ చేసుకోవాలి



నవతెలంగాణ-మిరుదొడ్డి

ఉజ్వల యోజన పథకం ద్వారా గ్యాస్ పొందిన వినియోగదారులు మాత్రమే డిసెంబర్ 31లోపు ఈకేవైసీ చేసుకోవాలని మిరుదొడ్డి ఇండియన్ గ్యాస్ ప్రొప్రైటర్ సోమయ్య తెలిపారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలోని గ్యాస్ ఆఫీస్ వద్దకు పెద్ద ఎత్తున గ్యాస్ వినియోగదారులు రావడం జరుగు తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై 500 రూపాయలకే గ్యాస్ ఇస్తుందనే ప్రచారాన్ని నమ్మవ ద్దన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీ గ్యాస్‌పై ప్రకటన రాలేదన్నారు. కేవలం ఉజ్వల యోజన పథకం వారికే ఈనెల 31 లోపు ఈ కేవైసీ చేసుకోవాలన్నారు. మండలంలోని గ్యాస్ మీద పెద్ద ఎత్తున ఈ కేవైసీ కి తరలిరావడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు.

చేబర్తి ఉపాధ్యాయుల, వీడ్కోలు, స్వాగత సభ



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ మండలంలో చేబర్తి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ వెళ్లిన ఉపాధ్యాయులకు, నూతనంగా బదిలీ వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం తెలుపుతూ బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల చేబర్తి గ్రామానికి చెందిన నీరడి సురేష్‌కు విద్యుత్ శాఖలో లైన్ మెన్‌గా ఉద్యోగం వచ్చిన సందర్భంగా పాఠశాలకు రూ.17 వేల మైక్‌సెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో ఉదయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు మైక్ సెట్ ను అందజేసిన సురేష్ అభినందించారు. పాఠశాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు.అనంతరం దాత సురేష్ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు షాభోద్దీన్, ఉపర్పంచ్ స్వామి,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులున్నారు.

ఆయిల్‌పామ్ పంటలను సందర్శించిన ఏవో



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని ఆయిల్‌పామ్ తోటలను మండల వ్యవసాయ అధికారి టి. నాగేందర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాలలో రైతులు పండిస్తున్న ఆయిల్‌పామ్ తోటలు గుత్తులు వేసే దశలో ఉన్నాయని తెలిపారు. ఆయిల్‌పామ్ తోటలలో పూల గుత్తులను (అబీలేషన్) తీయుటపై రైతులకు అవగాహన కల్పించారు. సాధారణంగా ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన 14 నుండి 18 నెలలో పూతకు వస్తాయన్నారు. ఒకే మొక్కపై ఆడ, మగ పుష్పాలు పూస్తాయన్నారు. తొలిదశలో వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందాలంటే, తొలి దశలో వచ్చే పూలను తీసివేయాలన్నారు. ఈ ప్రక్రియ 30 నెలల వరకు చేసుకోవాలని సూచించారు.

వచ్చే అన్ని ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి ఖాయం



గజ్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్

నవతెలంగాణ-గజ్వేల్

వచ్చే అన్ని ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఓడిస్తారని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 9 సంవత్సరాలు గజ్వేల్ నియోజకవర్గ ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు చోటు లేదని, రానున్న కాలం బీజేపీదేనని అన్నారు. పార్ల మెంటు, స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారన్నారు. నియోజకవర్గంలోని అన్ని సర్పంచ్ స్థానాలకు, జిల్లా పరిషత్, జెడ్పిటి స్థానాలకు బిజెపి పోటీ చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ లతో ప్రజలను గారడీ చేయాలని చూస్తుందని పేర్కొన్నారు. వంద రోజుల్లో ఆరు స్కీములు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి నాయకులు



నవతెలంగాణ-తొగుట

బహుజన బిడ్డ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించిన పొన్నం ప్రభాకర్‌కు మంత్రి పదవి ఇవ్వడం సంతోషకరమని దుబ్బాక నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేటలో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను తొగుట మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా జిల్లాకు రావడంతో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తొగుట మండల నాయకులను మంత్రికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో తొగుట మండలం మంత్రి పర్యటించడానికి హామీ ఇచ్చారని తెలి పారు. కార్యక్రమంలో ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి,మండల అధ్య క్షులు అక్కం స్వామి, టిపిసిసి ఫిషర్ మెన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి ముదిరాజ్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



నవతెలంగాణ-జగదేవపూర్

నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంత్రిని కలిసినట్లు తిగుల్ సర్పంచ్ భాను ప్రకాష్ బుధవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబును అసెంబ్లీ భవనంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపామన్నారు. కలిసిన వారిలో టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు, గజ్వేల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గజ్వేల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి బునారి రాజు, చంద్రం, నవీన్, సాయి తదితరులు ఉన్నారు.